## రోహిణి ఎండలు వచ్చేశాయి..!




ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



# లక్ష్యం సాధించే వరకు విశ్రమించొద్దు



### ఎంత కష్టమైనా మందుకు సాగాలి
### పదిలో ప్రైవేటుగా ధీటుగా మంచి ఫలితాలు
### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
### వెంకట్ ఫౌండేషన్ ఆద్వర్యంలో విధ్యార్థులకు నగదు బహుమతులు




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** విధ్యార్థులు లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించొద్దని, అహర్నిషలు శ్రమించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. ఎంత కష్టం వచ్చినా వెనుకడుగు మాత్రం వేయవద్దని, ముందుకే సాగాలని సూచించారు. శనివారం సాయంత్రం కరీంనగర్ బొమ్మకల్ బైపాస్ రోడ్ లోని వి కన్వెన్షన్ హాలులో వెంకట్ ఫౌండేషన్ ఆద్వర్యంలో గంప వజ్రమ్మ మూడవ విద్యా పురస్కార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. 10 జిపిఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులకు ఒక్కొక్కరికీ మూడు వేల నగదు, గోల్డ్ మెడల్‌ను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సంధర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విధ్యార్థులకు వెంకట్ ఫౌండేషన్ ఆద్వర్యంలో సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. విధ్యార్థులను తల్లిదండ్రులు ఎల్లప్పుడూ ప్రోత్సహించాలని , తద్వారా వారు మంచి ఫలితాలు సాధిస్తారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. కరీంనగర్ జిల్లాలో 88 ప్రైవేట్ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వస్తే 84 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. వారు తలచుకుంటే ప్రైవేట్ పాఠశాల విధ్యార్థుల కంటే ముందుంటారని పేర్కొన్నారు. పదో తరగతిలో మార్కులు ఎక్కువగా వచ్చాయని, ఇంటర్‌లో చదవకుండా ఉండొద్దని సూచించారు. చదువులో ఫస్ట్ ఉండాలని, గమ్యస్థానం చేరుకునే వరకు కష్టపడుతూనే ఉండాలని పేర్కొన్నారు. పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ విధ్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 జిపిఏ సాధించిన 120 విధ్యార్థులకు ఒక్కొక్కరికీ మూడు వేల చొప్పున నగదు బహుమతి గోల్డ్ మెడల్‌ను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ అందజేశారు. అలాగే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ పమేలా సత్పతి, పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌ను వెంకట్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సమావేశంలో సివిల్స్ ర్యాంకర్స్ నందాల సాయికిరణ్, కొలనుపాక సహన, వెంకట్ ఫౌండేషన్ చైర్మన్ గంప వెంకట్, వైస్ ప్రెసిడెంట్ జయ రాములు, సెక్రటరీ సతీష్ కుమార్, నాగరాజు, వెంకట్ ఫౌండేషన ప్రతినిధులు, విధ్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# లంకె బిందెల పేరిట...లక్షలు దోచారు...!

### అమాయక మహిళను అడ్డంగా ముంచిన కేటుగాళ్ళు
### అత్యాశకు పోయి అంతా పోగొట్టుకున్న మహిళ
### మోసపోయానని గ్రహించి ఠాణా మెట్లెక్కిన వైనం




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** దొంగ బాబాలను, పూజారులను, జ్యోతిష్యులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించిన వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ అమ్మగారి ఇంట్లో లంకె బిందెలు ఉన్నాయని నమ్మబలికి అమాయక మహిళను మోసగించిన ముగ్గురు కేటుగాళ్ళను వేములవాడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లి కోనాయపల్లి గ్రామానికి చెందిన సింగారపు అంజవ్వ అనే మహిళ గత ఏడాదిన్నరగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ విషయాన్ని తన సమీప బంధువు ఎల్లయ్య దృష్టికి తీసుకువెళ్లింది. దీంతో ఎల్లయ్య వేములవాడ అర్బన్ మండలంలోని చంద్రగిరిలో మహిపాల్ అనే ఒక పూజారి ఉన్నాడని, అతని దగ్గరికి వెళ్లి నాటు వైద్యం చెట్ల మందులతో కూడిన చేయించుకుంటే నీకున్న రోగం నయమవుతుందని అంజవ్వను నమ్మబలికి మహిపాల్ దగ్గరికి తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో వైద్యం కొరకు నిత్యం మహిపాల్ దగ్గరికి వెళ్తూ, వస్తున్న హన్మవ్వ తనకున్న అన్ని సమస్యలతో పాటు వ్యక్తిగత విషయాలను సైతం పంచుకుంది. ఇక ఇదే అదునుగా భావించిన మహిపాల్, అంజవ్వ జాతకం చూసి తన తల్లిగారి ఇల్లైన కోనాయపల్లిలో లంకె బిందెలు ఉన్నాయని, వాటిని తవ్వితీస్తే పెద్ద ఎత్తున బంగారం లభిస్తుందని, వాటిని తవ్వి తీసేందుకు పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని నమ్మబలికాడు. ఇది నిజమని నమ్మిన అంజవ్వ విడతల వారిగా మహిపాల్ కు డబ్బులు ఇవ్వడం ప్రారంభించింది. ఇలా సుమారు 20లక్షల రూపాయల వరకు మహిపాల్ కు అప్పజెప్పింది. ఇదే సమయంలో మహిపాల్, ఆంజవ్వల వ్యవహార శైలిని గమనించిన సుద్దాలకు చెందిన అబ్రహం అనే వ్యక్తి కొంత కాలం తర్వాత వీరువురిని సంప్రదించి లంకె బిందెల్లో నుండి తీసిన బంగారం కడిగేందుకు తాను సహకరిస్తానని చెప్పి వారితో జతకట్టాడు. అబ్రహం మాటల నమ్మిన అంజవ్వ 10లక్షల రూపాయల వరకు అప్పజెప్పింది. ఇలా మొత్తం 30లక్షల రూపాయలు ఇద్దరికి అప్పజెప్పింది. అయితే రోజులు గడుస్తున్నా మహిపాల్, అబ్రహం లు చెప్పిన విధంగా జరగకపోవడం, ఇచ్చిన డబ్బుల విషయంలో వారు ఇద్దరు స్పందించకపోవడంతో ఇక మోసపోయానని గ్రహించిన అంజవ్వ చేసేదేమీ లేక వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసింది. అంజవ్వ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, ఈ క్రమంలో మహిపాల్(A1)అబ్రహం(A2) ఎల్ల(A3)లను చాకచక్యంగా పట్టుకుని వారిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. దొంగ బాబాలను, పూజారులను, జ్యోతిషులను నమ్మి మోసపోవద్దు: సీఐ వీర ప్రసాద్ అమాయక ప్రజలను ఆసరాగా చేసుకుని ఈ మధ్య కాలంలో కొంతమంది సాధారణ వ్యక్తులే సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బాబాలు, పూజారులు, జ్యోతిష్యం చెబుతాం అనుకుంటూ వచ్చి ప్రజలను బురిడీ కొట్టించి అక్రమ మార్గంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాంటి వారిని నమ్మి మోసపోవద్దు. మూఢ నమ్మకాలను విశ్వసించవద్దు. అసాంఘిక, చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి వారి వల్ల మోసపోయిన వారు ఇంకా ఎవరైనా ఉంటే నిర్భయంగా వచ్చి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయవచ్చు.

## కల్తీ మద్యం.. ఆపేదెవరు?



## విత్తన కొనుగోలులో జాగ్రత్తలు

**ప్రజాపక్షం/బోథ్ :** విత్తన కొనుగోలులో రైతులు జాగ్రత్తలు వహించాలని ఏఈఓ శ్యాంసుందర్ రెడ్డి అన్నారు. శనివారం కంటెగాం గ్రామంలో విత్తన దుకాణాన్ని తనిఖీ చేసిన అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లోకి నకిలీ విత్తనాలు వస్తున్నాయని రైతులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయని విత్తనాలు కొనే ముందు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని, దుకాణాల్లో రసీదులు తప్పని సరిగా పొందాలని అన్నారు.

## నిప్పు అంటుకుని ఈతవనం దగ్ధం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం శివారులో గౌడ సంఘం సొంత భూమిలో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఈత చెట్లు దగ్ధం అయినట్లు గీత కార్మికులు తెలిపారు. గీతా కార్మికులు ఈత వనానికి నిప్పు అంటుకున్న సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పినప్పటికి 2008 చెట్లు 80శాతం కాలినట్లు గీత కార్మికులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని గీతా కార్మిక సంఘం నాయకులు కోరారు.

## ఈదురుగాలుల బీభత్సం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలో శనివారం భారీ ఈదురు గాలులు భీభత్సాన్ని సృష్టించాయి. సాయంత్రం వేళ పిడుగులు మెరుపులతో భారీగా గాలులు వీయడంతో ఫర్టిలైజర్ దుకాణానికి ఎరువులు తీసుకువచ్చిన లారీ డ్రైవర్ మహమ్మద్ ఖాదీర్ పిడుగుల ధాటికి గుండెపోటుకు గురై మృతి చెందాడు. అలాగే రత్నాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి పై కప్పు పూర్తిగా లేచిపోయి ఆర్థికంగా నష్టపోయారు.

## నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సారంగాపూర్ మండల వ్యవసాయాధికారి తిరుపతి నాయక్ అన్నారు. శనివారం రోజున మండలంలోని ఆర్పపెల్లి గ్రామంలో వ్యవసాయాధికారి తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశమై నకిలీ విత్తనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. విత్తనాల కొనుగోలు చేసే ముందు ఖచ్చితంగా బిల్లులు తీసుకుని, పంట కాలం పూర్తి అయ్యే వరకు అట్టి బిల్లులు భద్రపరచుకోవాలని అన్నారు.

## అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

**ప్రజాపక్షం/జమ్మికుంట :** హనుమాన్ పెద్ద జయంతి సంధర్బంగా మండలం, అర్ధమండలం హనుమాన్ మాల ధరించి నిష్ట నియమాలతో స్వామివారికి పూజిస్తారని, హనుమాన్ జయంతి సంధర్బంగా గ్రామంలో హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని రథం ద్వారా పురవీదుల గుండా ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

# కాంగ్రెస్ నుంచి పలువురు నాయకుల బహిష్కరణ

### తుమ్మేటి సమ్మిరెడ్డికి షోకాజ్ నోటీసు జారీ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కసుబోజుల వెంకన్న, ఒల్లాల శ్రీనివాస్, ఎండి సలీం, ఎండి ఇమ్రాన్, ఎండి సలీం పాషా, వాసాల రామస్వామిలను పార్టీ నుంచి బహిష్కరించడంతో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డికి షోకాజ్ నోటీసు అందజేసినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితెల ప్రణవ్‌బాబుపై ఉద్దేశపూర్వకంగా చేసిన విమర్శలు, కక్షపూరితంగా చేసిన అసంధర్బ ఆరోపణలపై స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా అందిన ఫిర్యాదుల మేరకు , అంతర్గతంగా చర్చించుకోవాల్సిన పార్టీ విషయాలను బహిరంగంగా పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకులుపై ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే వీరిలో కొంతమంది పలుమార్లు కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీలోకి వలస వెళ్లడం తిరిగి రావడం , బిజెపి, బిఆర్ఎస్‌లకు చెందిన వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించడం, కాంగ్రెస్ జిల్లా నాయకత్వంపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేయడాన్ని జిల్లా కాంగ్రెస్ తీవ్రంగా పరిగణించింది. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రెండు ఎన్నికల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకుల నాయకత్వంలో కార్యకర్తలు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయడం కాంగ్రెస్ ప్రకటించిన హామీలపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం ఉంచి ఓటు వేసినప్పటికీ ఇదంతా తమ ద్వారానే జరిగిందంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అయోమయం కలిగే విధంగా ప్రవర్తించడాన్ని , కార్యక్రమాలు చేపట్టడాన్ని , వ్యవహరించడాన్ని జిల్లా కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చెన్నారెడ్డి ఆదేశానుసారం పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఈ క్షణం నుంచి వీరికి కాంగ్రెస్‌తో ఎలాంటి సంబంధాలు లేవన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడినని తనకు తానే ప్రచారం చేసుకుంటున్న జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి వ్యవహరించిన తీరును పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు వారిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వారికి కాంగ్రెస్ పార్టీ పక్షాన షోకాజ్ నోటీసు అందజేస్తూ వారం రోజుల్లోగా ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని తెలియజేశారు.

## జగిత్యాల డిఎంహెచ్‌ఒను వెంటనే సస్పెండ్ చేయాలి



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** అగ్రకుల దురంహకారంతో జగిత్యాల జిల్లాలో 104 అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న కొప్పుల రాజ్ కుమార్ మరణానికి కారణమైన జగిత్యాల డిఎంహెచ్‌వో పుప్పాల శ్రీధర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 104 అంబులెన్స్ డ్రైవర్ కొప్పుల రాజ్ కుమార్ డిఎంహెచ్‌వో వేధింపులు భరించలేక శుక్రవారం విధులు నిర్వహిస్తు గుండెపోటుతో మరణించగా శనివారం మృతుని కుటుంబానికి న్యాయం జరగాలని 104 సిబ్బందితో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా రాజ్ కుమార్‌ను పుప్పాల శ్రీధర్ వేధిస్తూ చేయకూడని పనులు చేయిస్తూ, డ్రైవర్ వృత్తి కాకుండా బాత్రూంలు, టాయిలెట్లు క్లీన్ చేయిస్తూ అతడిని తీవ్ర ఒత్తిడికి గురి చేశాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. ఈ పనులు చేయకుంటే మిమ్మల్ని సస్పెండ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడని రాజ్ కుమార్ కుటుంబ సభ్యులు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ముందు వాళ్ల బాధను తెలిపారని అన్నారు. డిఎంహెచ్‌వో శ్రీధర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అధికారులను కోరారు. లేని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యాక్షులు కాయితి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మెట్టు దాస్, ప్రధాన కార్యదర్శి ఎనుగంటి రాజేష్, 104 అంబులెన్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాస్వాల ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నక్క శేఖర్, భాస్కర్, సరిత, సైఫోద్దిన్, హేమలత, శ్రీలత, లీల తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి కంటి ఆసుపత్రిలో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** లయన్స్ క్లబ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ కంటి ఆసుపత్రి రేకుర్తిలో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్ శనివారం లయన్ సూర్యరాజ్ ప్రారంభించారు. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను మార్డ్యులర్ థియేటర్‌గా మార్చి రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు లయన్ దాత సూర్యరాజ్ అన్నారు. బయటి వాతావరణం నుంచి థియేటర్‌లోనికి ఎలాంటి ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. అత్యాధునిక థియేటర్‌ను అందుబాటులోకి తేగా ఆధునిక కంటి వైద్య సేవలు వినియోగించుకోవాలని చైర్మన్ కొండ వేణుమూర్తి కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి ట్రస్టీలు వైస్ చైర్మన్ చిదుర సురేష్, కార్యదర్శి ప్రకాష్ హోల్లా, డాక్టర్ టి.మురలీధర్ రావు, కోల అన్నారెడ్డి, లంబు సుధాకర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎన్.వెంకటేశ్వర్‌రావు, కోదండరాం, భద్రేశం, డాక్టర్లు తదితరులున్నారు.

## ఒబిసిల ఐక్యత గెలిచింది



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఒబిసి రిజర్వేషన్ కోత పెడుతూ అట్టి రిజర్వేషన్లను మైనార్టీలకు కేటాయించడం మూలంగా అన్యాయం జరుగుతుందని పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఓబిసిలు ఐక్యతో పోరాడి కోర్టులో కేసు గెలవడం ద్వారా కలకత్తా హైకోర్టు తాజాగా గతంలో ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను రద్దు పరచాలని తీర్పునివ్వడంపై స్వాగతించదగ్గదని చిగురుమామిడి మండల ఓబిసి మోర్చా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు గర్డన్ సతీష్ ఆధ్వర్యంలో సుందరగిరి గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆడిచర్ల రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, బిజెపి చిగురుమామిడి మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఓబిసిలకు జరుగుతున్న అన్యాయంపై పోరాట ఫలితం మూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పులో ఓబిసిలకు ఉండాల్సిన రిజర్వేషన్ పూర్వంలాగే ఉండాలని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ తరహా ఓబిసిలు చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగాతీసుకుని తెలంగాణలోనూ ఓబిసిల హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిజెపి మండల ఉపాధ్యక్షులు కంది శంకర్, ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు ముంజ చంద్రయ్య, బిజెపి మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, బిజెపి నాయకులు జంగా శ్రీనివాస్ రెడ్డి, ఓబిసి మండల కార్యదర్శి నడిగొట్టు కిరణ్, తూలైల వెంకన్న, కొయ్యడె శేఖర్, కట్ల సంపత్, కసావేని రమేష్, మెరుగు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## విత్తన షాపులను తనిఖీ చేసిన ఎస్ఐ



**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండలంలోని చల్లూరు ఫెర్టిలైజర్ షాపులను ఎస్ఐ తోట తిరుపతి తమ సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సంధర్బంగా షాపులోనే రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన విధానాలకు సంబంధించిన రసీదులు పొందాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా రైతుల వద్దకు వచ్చి విత్తనాలు ఇస్తామని చెప్పినట్లయితే అట్టి విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, సరైన టాకింగ్ లేబుల్ లేకుండా లూస్‌గా ఉంటే వాటిని కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ దాడుల్లో ఏవో గణేష్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.


## తీన్మార్ మల్లన్నపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగదు



హుజురాబాద్ నియోజకవర్గ మాజీ కో కన్వీనర్ మహమ్మద్ అంకుస్

**ప్రజాపక్షం/జమ్మికుంట :** ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కెటిఆర్‌కు ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినప్పటికీ ఇంకా అహం తగ్గలేదని తీన్మార్ మల్లన్న టీం హుజురాబాద్ నియోజకవర్గ మాజీ కో కన్వీనర్ మహమ్మద్ అంకుస్ అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల స్థానానికి కాంగ్రెస్ పక్షాన ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను ఓర్వలేకపోతున్నాడని పేర్కొన్నారు. శనివారం జమ్మికుంటలో విలేకర్లతో మాట్లాడుతూ అసామాన్యుడిగా ఎదిగిన తీన్మార్ మల్లన్నను ఉద్దేశించి మీకు బిట్స్ పిలానీ కావాలా? పల్లి బఠాణీ కావాలా? అంటూ హేళన చేస్తూ మాట్లాడిన కెటిఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు. సామాన్యుడు రాజకీయాలు చేయొద్దా? కెటిఆర్ దృష్టిలో గవర్నమెంటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుకున్న వారు పల్లి బఠానీలు అమ్ముకోవడానికి పనికొస్తారని ఉద్దేశ్యమా? అని ప్రశ్నించారు. పదేళ్లలో తెలంగాణను సర్వనాశనం చేసి ఇవాళ సుద్దపూస ముచ్చట్లు చెబుతూ తెలంగాణ నష్టపోవడానికి కాంగ్రెస్ కారణమైనట్లుగా ప్రజలను మభ్యపెడుతూ ఏ మొఖం పెట్టుకుని ప్రజల్లో తిరుగుతున్నారో ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిదన్నారు.

## 10 జిపిఎ సాధించిన చరణకు ఎంఎల్ఎ నగదు బహుకరణ



**ప్రజాపక్షం/చొప్పదండి :** ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో చదివి 10 జిపిఏ సాధించిన చొప్పదండి మండలంలోని కొలిమికుంట గ్రామానికి చెందిన గోల్లపు చరణ్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. ఈ మేరకు శనివారం ఆయన కార్యాలయంలో చరణ్‌ను సన్మానించి రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారు. పై చదువులకు వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ రెండవ వార్డు సభ్యుడు ఆకుల సురేష్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి వడ్లూరి నాగరాజు, నాయకులు బొంగోని నాగరాజు తదితరులున్నారు.

# రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తం

* హుజురాబాద్ మండల వ్యవసాయాధికారి చందుపట్ల సునీల్ కుమార్



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని హుజురాబాద్ మండల వ్యవసాయాధికారి చందుపట్ల సునీల్ కుమార్ అన్నారు. శనివారం రోజున హుజురాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని, పంట కాలం పూర్తి అయ్యే వరకు అట్టి బిల్లులను భద్రపరుచుకోవాలని అన్నారు. విత్తన ప్యాకెట్లపై కనీస ధర కన్న ఎక్కువగా పెట్టి కొనరాదని, ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని తీసుకుంటే పంట దిగుబడి సమయంలో నకిలీవని తేలితే చాలా నష్టపోతారని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మే వారిని వ్యవసాయ శాఖ కార్యాలయంలో తెలియపరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పొద్దుటూరి సతీష్, గ్రామ పంచాయితీ కార్యదర్శి జయేందర్, కారోబార్, రామస్వామి, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలం పెద్ద బండ గ్రామము నుండి లోనవెల్లి సబ్ స్టేషన్ వరకు 33కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తుల పనులను విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం చేపట్టనున్నట్లు కౌటాల ఎఇ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమత్తుల కారణంగా ఆదివారం ఉదయం 8. 30 నుండి 11. 30 గంటల వరకు సిర్పూర్ లోనవెల్లి, కౌటాల, చింతలమానపల్లి, బెజ్జూరు మండలాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన మండల నాయకురాలు విజయ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకురాలు కుసుమ విజయ శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన విజయకు జిల్లా అధ్యక్షులు కండువా కప్పి సాధరంగా కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీ ఐక్యతను కాపాడుతూ పనిచేస్తానని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## స్కానింగ్ సెంటర్ తనిఖీ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** స్కానింగ్ సెంటర్లలో అర్హులైన వైద్యులను మాత్రమే నియమించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ సూచించారు. శనివారం జిల్లా వైద్యాధికారి తుకారం బట్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని శ్రీనివాస స్కానింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్కానింగ్ సెంటర్ సిబ్బందికి అవగాహన కల్పించారు. స్కానింగ్ సెంటర్లలో రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీయడంతో పాటు అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన సీఐ



**ప్రజాపక్షం/సారంగాపూర్ :** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని పోలీస్ స్టేషన్ నిర్మల్ రూరల్ సిఐ బి.శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలలో బాగంగా విసిట్ చేసి పోలీస్ స్టేషన్ యొక్క రికార్డ్స్ లను పరిశీలించారు.అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని సూచనలను సిబ్బందికి తెలిపారు.

## ఎస్‌సి గురుకులాల్లో ఇంటర్ సీట్లకు దరఖాస్తు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మే 31 లోపు ఎస్సీ గురుకులాల్లో 2024/25 విద్యా సంవత్సరానికి మిగిలిపోయిన జూనియర్ ఇంటర్ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయ అధికారి జే.జే.థెరిస్సా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 202425 విద్యా సంవత్సరానికి నాన్‌సిఓఈ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరములో మిగిలిపోయిన సీట్లభర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని,2023 24 లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మే 31 లోపు గురుకుల సొసైటీ వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సిఈసి, హెచ్ఈసి, ఒకేషనల్ కోర్సులలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు రుసుము వంద రూపాయలు ఆన్ లైన్ లో చెల్లించి తమ దరఖాస్తులను మే 31 లోపు సమర్పించాలని ఎస్సీ గురుకుల సొసైటీ జిల్లా సమన్వయ అధికారి పేర్కోన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్ సిసి డబ్ల్యూ యు ఐ ఎఫ్ టి యు) ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో సింగరేణి C&M.D బలరాం నాయక్ కు శనివారం వినతిపత్రం అందజేశారు.సింగరేణి కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాలలో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని వీరికి మన సింగరేణి కంపెనీ కోల్ సెక్టార్ సిస్టం కానీ, ఫ్యాక్టరీయాక్ట్ సిస్టం కానీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం వల్ల సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధంగా రావలసిన హక్కులు, సౌకర్యాలు అమలు కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఈ కార్మికులు శ్రమ దోపిడికి గురి అవుతున్నరని ఈ విషయం సింగరేణి యాజమాన్యానికి తెలిసి కూడా నిమ్మకు నీరెత్తనీ చందంగా వ్యవహరిస్తుందని కాబట్టి ఇప్పటికైనా ఇట్టి విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి కాంట్రాక్ట్ కార్మికులకు తగు న్యాయం జరిగే విధంగా చూడాలని అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు చెందవలసిన హక్కులు సౌకర్యాల గురించి ఈ వినతి పత్రంలో పేర్కొంటూ వివరించడం జిగింది.

## కోళ్ళు మృత్యువాతకు కారణమైన వారిపై చర్యలు



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** కరెంట్ హెచ్చుతగ్గులతో షార్ట్ సర్క్యూట్‌కు గురై మూడు వేల కోళ్ళు ఫౌల్ట్రీఫాంలో మృత్యువాతకు గురయ్యాయి.దీనికి కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట బీజేపి మండల శాఖ కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.సద్దమద్దుల రాజిరెడ్డిది నిరుపేద కుటుంబం అని ఆయనను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.వారి ఫౌల్టీ ఫాంను శనివారం పరిశీలించారు.గత కొన్నెళ్లుగా విధేశాలకు వెళ్లివచ్చి స్వశక్తితో పని చేసుకుంటున్నాడని సుమారుగా ఐదు లక్షల విలువ చేసే కోళ్ళు మరణించాయని భాధితుడు విలపించడన్నారు. విద్యుత్ నియంత్రణ ఎల్లారెడ్డిపేటలో సరగాలేదని బీజేపి మండల శాఖ తరపున పోరాడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, కిరణ్‌నాయక్, బందారపు లక్ష్మారెడ్డి, వంగ శ్రీకాంత్, దేవదాసు, రాజెందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి,రామేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, కార్తిక్‌రెడ్డి, రాజు పాల్గోన్నారు.

## వరిధాన్యాన్ని దొంగలించిన మహిళ

**ప్రజాపక్షం/చందుర్తి :** కళ్ళల్లో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని దొంగిలించిన మహిళకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని మల్యాల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మల్యాల గ్రామానికి చెందిన మోత్కుపల్లి రాజవ్వ తన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో నిలువ ఉంచారు. ధాన్యపు రాశుల వద్ద రైతులు ఎవరూ లేకపోవడంతో అదునుగా భావించిన కొందరు మహిళలు గుట్టుచప్పుడు కాకుండా సంచులతో ధాన్యాన్ని నింపుకుంటుండగా రైతు రాజవ్వ ఆ మహిళ దొంగను పట్టుకుంది. మిగతా దొంగలు పారిపోవటంతో దొరికిన మహిళకు దేహశుద్ధి చేసి చందుర్తి పోలీసులకు సమాచారం అందించారు.

కళ్ళల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## ఎట్టకేలకు పోతారంకు సబ్ స్టేషన్

మూడేళ్ల కృషికి ఫలితం

**ప్రజాపక్షం/ముత్తారం :** మూడేళ్ల కృషికి ఫలితంగా ఎట్టకేలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పోతారం గ్రామానికి సబ్ స్టేషన్ కోసం మంజూరు వచ్చినట్లు మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ తెలిపారు. శనివారం గ్రామ శివారులో సబ్ స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ ఏఈ హనుమాన్ దాస్, మాజీ సర్పంచ్ మహేందర్, మాజీ ఉపసర్పంచ్ తూడూరి నరేందర్ తోపాటు గడ్డం మారుతి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మూడేళ్ల నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటికి ఫలించాయన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేద పండిత సమక్షంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం 25వ వార్షిక దినోత్సవం సందర్భంగా గత మూడు రోజుల నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజైన శనివారం అమ్మవారికి సూక్త అభిషేకం, స్థాపితా దేవతాహోమం, జయాదులు, దిక్బలి, అనంతరం నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం భక్తులకు ప్రజలకు మహా అన్నదన్న కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన శోభయాత్రలో అమ్మవారి ఉత్సా విగ్రహంను పట్టణంలోని పలు వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి.

## బాల సదనమును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ మండలంలోని కొండాపూర్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్న బాలసదనమును సీనియర్ సివిల్ జడ్జి జి.రాధిక శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశించి సంతృప్తి వ్యక్తం చేశారు..ప్రతి నెల సందర్శిస్తానని తెలిపారు.పిల్లలతో ముఖాముఖి మాట్లాడి పలు విషయాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఏ.నాగమణి,బాలల సంక్షేమ అధికారి ఏ నాగమణి,బాలల సంక్షేమ సమితి సభ్యురాలు సల్ల శ్రీలత ఇన్చార్జి సూపరింటెంట్ కవిత,జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి.మురళి,న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, నరేందర్, సుమలత పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి



**ప్రజాపక్షం/ఇచ్చోడ :** నేల తల్లిని దైవంగా భావించే అన్నదాతలకు నకిలీ పత్తి విత్తనాలను అంటగట్టిన సీడ్స్,ఫర్టిలైజర్ వ్యాపారాలపై కేసులను నమోదు చేయాలని రైతు స్వరాజ్య జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న అన్నారు.శనివారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు.వ్యాపారులు వారి వారి సంబంధికులు ద్వారా ఏజెన్సీ గ్రామాల్లోకి నకిలీ విత్తనాలను తీసుకెళ్తూ అమాయక రైతులకు విక్రయిస్తూ నిండా ఉంచుతున్నారని ఆయన ఆరోపించారు.మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల ను వ్యవసాయ ఆధికారులు సరిపడే స్టాక్ ఉంచాలని పేర్కొన్నారు.రైతులకు నకిలీ విత్తనాలను అమ్మిన వ్యాపారులను గుర్తించి వారి లైసెన్సులను వెంటనే జిల్లా ఉన్నత అధికారులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం విత్తన రాయితీ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతు నాయకులు విష్ణు, ప్రకాష్, రాము, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.